# అభ్యాసన ఫలితాలే ధ్యేయంగా బోధన సాగాలి

## ఏఎంసీఎం ఘనపురం దేవేందం





ఆలూర్, బతుకమ్మ అభ్యాసన ఫలితాలే ధ్యేయంగా బోధన సాగాలని అకడమిక్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, తెలుగు రిసోర్స్ పర్సన్ ఘనపురం దేవేందర్ అన్నారు. మంగళవారం ఆలూర్ మండలం గుత్ప జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఫిబ్రవరి నెల తెలుగు స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ కు హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యాసన ఫలితాలను సాధించడమే లక్ష్యంగా బోధన సాగినప్పుడే ఇటువంటి సమావేశాలకు అర్థం ఉంటుందని, తెలుగు భాషా బోధన పిల్లల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేలా ఉండాలని కోరారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ద్రుపద్ కుమార్ మాట్లాడుతూ, తెలుగు భాషలోని అన్ని ప్రక్రియల్లో విద్యార్థులతో విరివిగా అభ్యాసాలు చేయించాలని, ఈ విషయంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులంతా పోటీపడి ఫలితాలు సాధించాలని ఉత్సాహపరిచారు. ఈ సమావేశంలో బాద్గుణ ఉపాధ్యాయుడు గంగాధర్ ప్రదర్శించిన 'పల్లెటూరి పిల్లగాడ' మోడల్ పాఠ్య బోధన ఆదర్శనీయంగా సాగగా, పదవ తరగతి కార్యాచరణ ప్రణాళికపై రిసోర్స్ పర్సన్లు టీ. సాయిలు, బి. సురేందర్ నిర్వాహకులుగా వ్యవహరించి ప్రత్యేక చర్చలు జరిపారు. త్వరలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుల, విద్యార్థుల రచనలతో పుస్తకం తీసుకువస్తామని రిసోర్స్ పర్సన్ టేకురాల సాయిలు అన్నారు

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, డాక్టర్ గంధం విజయలక్ష్మి, కె.వి. రమణాచారి, గంగాధర్, చంద్ర సుధీర్, సాయిలు, సురేందర్, రాజేశ్వర్, సుధాకర్, వాణి, ప్రమోద్ కాంప్లెక్స్ పరిధిలోని తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమాజాబివృద్ధిలో యువత పాత్ర కీలకం

## మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి



భీమ్ గల్, బతుకమ్మ :సమాజంలో మార్పు రావాలన్న, సమాజాభివృద్ధి కావాలన్న యువతదే కీలక పాత్ర అని భీమ్ గల్ మున్సిపల్ చైర్మన్ బోదిరే నాగమణి స్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బోర్ర హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్ బోదిరే నాగమణి స్వామి, కౌన్సిలర్ లు లావణ్య నరసయ్య, నీలం రవి లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూత్ సభ్యులు తనను సన్మానించి మరింత భాధ్యత పెంచడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు .అభివృద్ధికి యువత చూపిస్తున్న చురుకుదనం అభినందనీయమని, మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిజంగా ప్రశంసనీయమన్నారు.నేను ఎల్లప్పుడూ యువతకు అండగా ఉంటానని, పట్టణ అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని, మీ ఆలోచనలు, సూచనలను ఎప్పుడూ స్వాగతిస్తానన్నారు.

మీ అందరి ప్రేమ, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు గంగం నరేష్, సభ్యులు పురస్తుబద్రి, నరేష్, తిరుపతి, సురేష్, ప్రవీణ్, రెడ్డి, తిరుపతి, శ్రీకాంత్, నవీన్, లింబాద్రి, శ్రీనివాస్, హరీష్, చింటూ, శ్రీనివాస్ ,శివ, తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమాజంపై దాడులను ఉపేక్షించే ప్రసక్తే లేదు

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకుంటే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆందోళనలు

### బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లాలో ఇటీవల జరుగుతున్న దాడుల ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మంగళవారం ఇందూరు జిల్లా పోలీస్ కమీషనర్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా జిల్లాలోని బాన్సువాడ, మోపాల్ మండల పరిధిలోని కాల్పోల్ గ్రామం, రుద్రూర్, ఆనంద్ నగర్, అలాగే ఇందూరు నగరంలోని మిర్చి కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో అమాయక ప్రజల పైన జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దాడులు జరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు బాధ్యులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ ఘటనలు జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా మారుతున్నాయని, ఇలాంటి వాటిని బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. దాడులకు పాల్పడిన వారిని కొందరు ఉద్దేశపూర్వకంగా రాజకీయంగా కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని, పోలీసులు పక్షపాత రహితంగా వ్యవహరించి నిందితులను చట్టం ముందు నిలబెట్టాలని కోరారు. జిల్లాలో హిందూ సమాజం భయభ్రాంతులకు గురవుతోందని, తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజలు స్వయంగా రోడ్డెక్కే పరిస్థితి తలెత్తుతుందని ఆయన హెచ్చరించారు. ప్రతి సంఘటనపై స్పెషల్ టీమ్ (ప్రత్యేక బృందం) ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలను వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సున్నిత ప్రాంతాల్లో పర్మినెంట్ సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పోలీసు పహారా పెంచాలని సూచించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేసి, వారికి పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వెంటనే స్పందించి నిందితులకు తగిన బుద్ధి చెప్పాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా భారీ ఆందోళనలు, నిరసనలు, ర్యాలీలు చేపడతామని గట్టిగా హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం, ధర్మ రక్షణ కోసం బీజేపీ ఎప్పుడూ ముందుంటుంది... న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓం సింగ్, గోపిడి వినోద్ రెడ్డి, కృష్ణ, మారెడ్డి వనిత సురేష్, అమందు విజయ్ కృష్ణ, వినోద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొన్న అటవీ అధికారులు





కమ్మర్ పల్లి, బతుకమ్మ :మండలంలోని చౌట్ పల్లి రిజర్వుడ్ ఫారెస్ట్ పరిధిలో నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను మంగళవారం కమ్మర్ పల్లి రేంజ్ ఫారెస్ట్ అధికారులు పట్టుకొన్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం అందుకొన్న సంబంధిత డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లు కాపుకాసి ఉదయం 9 గంటల ప్రాంతంలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రెడ్హెండెడ్ గా పట్టుకొని ట్రాక్టర్ ను సీజ్ చేసి ట్రాక్టర్ ను రేంజ్ ఆఫీస్ కాంప్లెక్స్ కు తరలించారు. అక్రమ ఇసుక రవాణా చేసిన కోనపూర్ వాసన్ గుట్టకు చెందిన లకావత్ రాజేందర్ పై కేసు నమోదు చేశారు.

## టీ యూ లో తెలుగు అధ్యయన శాఖ చైర్మన్‌గా ప్రొఫెసర్ పి. కనకయ్య నియామకం




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ యూనివర్సిటీ లో తెలుగు అధ్యయన శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ పి. కనకయ్యను నియమిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు ఆదేశాల మేరకు జరిగింది.ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి. కనకయ్యకు వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. విశ్వవిద్యాలయంలో విద్యా ప్రమాణాల అభివృద్ధి, పాఠ్య ప్రణాళికల రూపకల్పనలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.ప్రొఫెసర్ పి. కనకయ్య గతంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, అకాడెమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్, డీన్, అడ్మిషన్స్ డైరెక్టర్ వంటి పలు కీలక పరిపాలనా పదవులను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం సీనియర్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.ఈ బాధ్యతలను తనపై నమ్మకంతో అప్పగించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రొఫెసర్ కనకయ్య, తనను అభినందించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తెలుగు అధ్యయన శాఖ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :వచ్చే ఏడాది 2027 జూలై 23 నుండి ఆగస్టు 3 వరకు జరుగనున్న గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. పుష్కరాల కోసం చేపట్టాల్సిన పనులు, సదుపాయాలను గుర్తిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో మంగళవారం పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ గోదావరి పుష్కర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన కందకుర్తి, తాడ్ బిలోలి, కోస్లీ, తుంగిని, బినోల, ఉమ్మెడ, పోచంపాడ్, సావెల్, తడ్పాకల్, దోంచంద, గుమ్మిర్యాల్ వద్ద 15 పుష్కర ఘాట్లు ఉంటాయని, వీటితో పాటు అనువైన ప్రాంతాలలో మరిన్ని ఘాట్లను గుర్తించవచ్చని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గోదావరి నది తీరంలో సౌకర్యాల కల్పన దిశగా పుష్కర ఘాట్ల వద్ద వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. స్టాళ్లు, తాగునీరు, తాత్కాలిక గదులు, వాహనాల పార్కింగ్, భద్రత, రూట్ మ్యాప్ ఇతర ఏర్పాట్ల వివరాలను పరిశీలించి, ఆయా శాఖల వారీగా సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉన్నందున అన్ని అంశాలను నిశితంగా పరిశీలన జరపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆర్టీసీ ఆర్.ఎం జ్యోత్స్న, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.